
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 14 జనవరి 2025
5
అన్నమయ్య



పేదలకు వరం సిఎం సహాయనిధి


బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. సోమవారం సిఎం సహాయ నిధి కింద మంజూరైన రూ.20 లక్షల చెక్కులను ఎమ్మెల్యే నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా అందజేశారు. పట్టణంలోని లబ్ధిదారులైన చంద్ర, తులసమ్మ, నసీబ్ జాన్ నరసిహులు నాయుడు, జబ్బార్, గోవిందయ్య, లలితలకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెద్ద జబ్బులతో బాధపడుతూ నగరాల్లోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స తీసుకొని ఆర్థికంగా ఇబ్బందుల పడుతున్నవారు ఆ బిల్లులతో సిఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకుంటే, వారి చికిత్సకు అయ్యే ఖర్చును ప్రభుత్వం సిఎం సహాయనిధి కింద అందజేస్తుందన్నారు. పేద ప్రజలు అంటే సిఎం చంద్రబాబుకు ఎంతో అభిమానన్నారు. ఇప్పటికే మదనపల్లి నియోజకవర్గంలో సుమారు రూ.80 లక్షల వరకు సిఎం సహాయనిధి చెక్కులు అందజేశామని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాటకొండ శ్రీనివాసులు నాయుడు, రెడ్డి రాయల్ పాల్గొన్నారు.

యురేనియం కాలుష్యం..

రైతన్నలకు శాపం

- నష్టాల్లో ఉద్యాన, పాడి రైతులు
- చర్మవ్యాధి బారిన ప్రజలు, పశువులు
- పైపుల లీకేజీతో కలుషితమవుతున్న నీరు
- తూతూ మంత్రంగా మెడికల్ క్యాంపులు
- నియంత్రణ చేయడంలో విఫలమైన అధికారులు


టెయిలింగ్‌పాండ్‌లో పేరుకుపోయిన వ్యర్థ పదార్థాలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

2007 సంవత్సరంలో పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం తుమ్మలపల్లి , మబ్బు చింతలపల్లి, కె.కె. కొటాల, రాచుకుంటపల్లి, భూమయ్య గారి పల్లి, మీది పెంట గ్రామాలకు సంబంధించిన భూములలో యురేనియం కర్మాగారాన్ని ప్రారంభించారు. యురేనియం వల్ల వచ్చే కాలుష్యం రైతన్నలకు శాపంగా మారింది. యురేనియం పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థ పదార్థాల వల్ల ప్రజలు, పశువులు చర్మ వ్యాధి బారిన పడుతున్నారు. వ్యర్థ పదార్థాల వచ్చే పైపులు లీకేజ్ కావడం వల్ల కాలుష్యం ఎక్కువై పంటలపై ప్రభావం చూపి పంటలు పండకుండా పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో అరటి బాగా సాగు చేస్తారు. అలాగే పాడి పరిశ్రమ కూడా మెండుగా ఉంది, కలుషితమైన నీరు వల్ల పంటలు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా వీటి ప్రభావం పశువుల పైన పడి పాడి రైతులు కూడా నష్టాలలో ఉన్నారు. కొంతమంది రైతులు పంటలు వేయకుండానే వదిలేశారు. వ్యర్థ పదార్థాలు భూమిలోకి ఇంకడం వల్ల నీళ్లు కలుస్తామవుతున్నాయి. తూతూ మంత్రంగా మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి మమ అనిపిస్తున్నారు. వీటిని నియంత్రణ చేయడంలో అధికారులు విఫలం కాడంతో 15 ఏళ్లుగా ఆరు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్న దాఖలాలు కనిపించడంలేదు. కలుషిత నీటితో పంట దిగుబడులు తగ్గడమే కాకుండా అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ విషయమై పలుమార్లు యూసిఐఎల్ అధికారులతో పాటు సంబంధిత అధికారులకు విన్నవించినా ఫలితం లేదని రైతులు, స్థానికులు ఆవేదన చెందుతున్నారు. వేముల మండలం ఎం. తుమ్మలపల్లె వద్ద భారత యురేనియం సంస్థ (యుసిఐఎల్) 2007లో యురేనియం తవ్వకాలతోపాటు శుద్ధి కర్మాగారాన్ని ఏర్పాటు చేసింది. అప్పట్లో పరిసర గ్రామాల ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తామన్న హామీ విస్మరించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వ్యాధులపై భరోసా శూన్యం

యురేనియం నుంచి వచ్చే వ్యర్థ పదార్థాలు భూమిలోనికి ఇంకి నీరు కలుషితం కావడంతో పరిసర ప్రాంతాలలో నివసించే ప్రజలకు పశువులకు చర్మవ్యాధులు వాటిల్లుతున్నాయి. రోగులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక ఆసుపత్రి ఏర్పాటు చేస్తామన్న హామీ ఇచ్చినా కేవలం గ్రామాల్లో నెలకొకసారి మాత్రమే వైద్యశిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ ప్రాంతవైద్య శిబిరాలు ఏర్పాటుచేస్తున్నారు. ఈ ప్రాంత సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడంలేదని వారంతా వాపోతున్నారు.

పంట దిగుబడులు తగ్గుముఖం..

ముడి యురేనియాన్ని శుద్ధిచేసిన తర్వాత వచ్చే వ్యర్థాలను కనం కిందకొట్టాల సమీపంలో నిర్మించిన టెయిల్‌ఫాండ్‌లో నింపుతున్నారు. దీంతో వ్యర్థాలు భూగర్భంలోకి వెళ్లి వ్యవసాయ గొట్టపుబావుల్లోకి చేరి కలుషితమవుతున్నాయి. ఈ నీటిని పంట తడులకు అందిస్తున్నారు. దీంతో పంటలు దెబ్బతిని దిగుబడులు తగ్గుతున్నాయి. రైతులు ఆర్థికంగా దెబ్బతి నడంతో కొంతమంది రైతులు పంట సాగుచేయకుండా బీడుగా వదిలేశారు. ఈ ప్రాంతంలో అరటి తోటలకు ఈ ప్రాంతం పెట్టిందిపేరు. అలాంటి పల్లెల్లో కలుషిత నీటితో దిగుబడులు పూర్తిగా తగ్గిపోయాయి.

నిరంతర పర్యవేక్షణ లేకపోవడం

యురేనియం వ్యర్థాల విషయంలో యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (యూసిఐఎల్) పర్యవేక్షణ లోపం వల్ల గత ఫిబ్రవరి నెలలో టెయిలింగ్ పాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్‌లైన్ లీకేజీ కావడం కలకలం రేపింది. దాదాపు 12 నుంచి 15గంటల పాటు వ్యర్థాలు పొలాల్లోకి ప్రవహించాయి. దీనిని గమనించిన కొందరు రైతులు యూసిఐఎల్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేశారు. ఆ వ్యర్థాలను పొరపాటున ఎవరైనా తాకితే చర్మం పూర్తిగా ఊడిపోతుందని చెబుతున్నారు. ఇలాంటి ప్రమాదం జరుగుతుందనే ఆందోళనతో ప్రజలు ఉన్నారు. యురేనియం వ్యర్థాలను నిల్వ చేసే టెయిలింగ్ పాండ్‌ను నిరంతరం పర్యవేక్షణ లేకపోవడం వల్ల ఇక్కడ పదేపదే పైప్‌లైన్ లీక్ కావడం పరిపాటిగా మారింది.

గ్రామాలు ఖాళీ అవుతున్నాయి..

యురేనియం కర్మగార పరిసర ప్రాంతాల గ్రామాలు ఖాళీ అవుతున్నాయి. వ్యర్థ పదార్థాల పైపులు లీకేజీ కావడం వల్ల వాతావరణంతో పాటు భూగర్భ జలాలు కలుషితమై చర్మ వ్యాధులు వస్తుందని పల్లె ప్రజలంతా పట్టణానికి తరలి వెళ్తున్నారు. దీంతో గ్రామాలు ఖాళీ అవుతున్నాయి.

- సింగం శెట్టి నాగేంద్ర, రైతు, కెకె.కొట్టాల, వేముల మండలం

నియంత్రణ చేయడంలో అధికారుల లోపం

యూనియన్ కర్మాగారం నుంచి వచ్చే వ్యర్థపు నీరు ప్రవహించే పైపుల నియంత్రణ చేయడంలో అధికారులు విఫలమయ్యారు. ఎక్కడో చోట రోజు పైపులు లీకేజీ కావడం వల్ల భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు కలుషితం కావడంతో సాగునీరు , తాగునీరు కలుషితమవుతున్నాయి. పంటలపై, చుట్టుపక్క గ్రామ ప్రజలపై ప్రభావితం చూపి పంటల నష్టంతో పాటు ప్రజల అనారోగ్య పాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు శాశ్వత పరిష్కారం కోసం అడుగులు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

- సింగం శెట్టి మోహన్ బాబు రైతు, కె.కె కొట్టాల, వేముల మండలం

నా పొలాన్ని వదిలేశాను..

యురేనియం పరిసర ప్రాంతాలలో ఉన్న వ్యవసాయ భూమిని వదిలేశాను. టెయిలింగ్ పాండ్ పైప్ లైన్ లీకేజీలతో భూమి తెలుపు రంగులోకి మారి కలుషితమైంది. ఏ పంట పెట్టినా ఎదుగుదల లేకుండా పోవడమేగాక దిగుబడి రాక నష్టాలొచ్చాయి. దీంతో ఎటువంటి పంటలు పెట్టకుండా వదిలేశాను. యూనియన్ అధికారులు కానీ, ఉన్నతాధికారులు పరిశీలించి తగు నష్టపరిహారం కల్పించాలి.

- మూడే బీమ్లా నాయక్ రైతు , కనంపల్లె

నిత్యం వైద్య క్యాంపులు నిర్వహించాలి

యురేనియం పరిసర ప్రాంతాల గ్రామాలలో నిపుణులైన వైద్యులతో రోజూ వైద్య క్యాంపులు నిర్వహించి, ప్రజలకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా అందించాలి. లేకపోతే యురేనియం బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. దీనివల్ల తిరుగుబాటులో వచ్చే అవకాశం ఉంటుంది.

- కె. తిరుపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, పులివెందుల.


వ్యర్థ పదార్థాలు వెళ్లే పైపు లీకేజీ పనులు (ఫైల్‌ఫోటో)

ఛార్జీలు తగ్గించాలంటూ..

భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ట్రూ అప్ ఛార్జీలను, పెంచిన కరెంట్ ఛార్జీలను రద్దు చేయాలి స్మార్ట్ మీటర్లు పెట్టొద్దు, అదానితో కుదుర్చుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తూ నిరసన తెలిపారు. అడ్డగోలుగా వివిధ రకాల విద్యుత్ ఛార్జీలను పెంచి ప్రజల నడ్డి విరుస్తున్నారని కూటమి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సిపిఎం ఈ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ ట్రూ ఆఫ్ ఛార్జీలను 2022, 23, 24 సంవత్సరాలకు సంబంధించి అదనపు భారాన్ని బిల్లులకు జమ చేయడం సరైందికాదని మండిపడ్డారు. సామాన్యుడు బిల్లులు కట్టలేని పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు నేడు చేస్తున్న పని ఏంటని ప్రశ్నించారు. అదానితో ఒప్పందం పెట్టుకుని ఓ వైపున రైతులకు, వివిధ వ్యాపార సంస్థలకు స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు చేస్తుండటాన్ని తప్పుపట్టారు. విద్యుత్ భారాలతో రైతులపై మరింత భారం పడుతుందన్నారు. ఇలాంటి విధానాలను వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి, సిపిఎం నాయకులు నాగరాజు, ప్రభాకర్, మల్లిఖార్జున, రమణ, వెంకటేష్, సహదేవ పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** టిడిపి కూటమి ప్రభుత్వం ప్రజల మీద మోపిన రూ.20 వేల కోట్ల విద్యుత్ ట్రూ అప్ ఛార్జీల భారాలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ భోగి పండుగ సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్మికుల నివాస ప్రాంతంలో కార్మికుల కుటుంబాలతో కలిసి భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు దహనం చేస్తూ నరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎ.రామాంజులు మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు ప్రవేశ పెట్టరాదని, విద్యుత్ భారాల తీవ్రత కారణంగా వైసిపికి 151 సీట్ల నుంచి 11కు చేరి ఘోర ఓటమి పాలైందని పేర్కొన్నారు. ఈ విషయం టిడిపి గ్రహించాలని హెచ్చరించారు. వెంటనే విద్యుత్, ఆర్‌టిసి, టోల్ గేట్, జిఎస్‌టి, పెట్రోల్, గ్యాస్, డీజిల్, వంట నూనె నిత్యావసర ధరలు తగ్గించాలని పేర్కొన్నారు. లేకపోతే వైసిపికి పట్టిన గతే పడుతుందని తెలిపారు. కార్య క్రమంలో చెన్నయ్య, అశోక్ మాధవి, అంజనమ్మ, రాణి, హరి మహమ్మద్ పాలొ న్నారు. **రాజంపేట అర్బన్ :** విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు చిట్వేలి రవికుమార్ ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భం రవికుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పిన చంద్రబాబు నేడు చేస్తున్న పని ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో హరినాథ్, ఉమా మహేశ్వరి, సుజాత, కళ్యాణి, సంయుక్త, కిషోర్, కార్తీక్, భాను, శేఖర్ పాల్గొన్నారు.


మదనపల్లె : విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేస్తున్న పట్టణ ప్రజలు


రాయచోటి : విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేస్తున్న నాయకులు


రాజంపేట : విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో దహనం చేస్తున్న నాయకులు

కులమే దేశానికి ప్రధాన శత్రువు :'బాస్'

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కుల వ్యవస్థ భారత దేశానికి ప్రధాన శత్రువని, ఆ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే గుర్తించి, కుల నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయాలని, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. బాస్ 13వ వార్షికోత్సవాల్లో భాగంగా మదనపల్లెలో నిర్వహించిన 'కుల దహనం' సభ తీర్మానాలను, బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధి దుర్గం సుబ్బారావుతో కలిసి సోమవారం బాస్ కార్యాలయంలో శివప్రసాద్ వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1917లో అమెరికాలోని కొలంబియా యూనివర్సిటీలో 'భారతదేశంలోని కులాలు' అనే అంశంపై బాబాసాహెబ్ అంబేద్కర్ ప్రసంగిస్తూ భారతదేశంలోని బాల్య వివాహాలు, సతీసహగమనం, అవిద్య, నిరుద్యోగం, పేదరికం.. వంటి అంశాలకు కుల వ్యవస్తే కారణమని తేల్చి చెప్పారని పేర్కొన్నారు. 1927లో అంటరానితనానికి వ్యతిరేకంగా జరిగిన మహద్ చెరువు పోరాటంలో ఆయన కుల వ్యవస్థకు, అంటరాణి తనానికీ అంతః సంబంధం ఉందని చెబుతూ, దానికి కారణమైన మనుధర్మ శాస్త్రాన్ని దహనం చేశారని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం తర్వాత, భారతరాజ్యాంగం కుల నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన చట్టాలను, ఆదేశాలను పాలక ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తత్కారణంగానే దేశ ప్రజల్లో కుల జాడ్యం పెరిగి, భారత జాతి ఐక్యతకు విఘాతం ఏర్పడిందని తెలిపారు. 'కుల దహనం' సభలో తీసుకున్న తీర్మానాలను వారు వివరిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వాలు సమైక్య కార్యాచరణతో కుల నిర్మూలన కోసం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు. కుల వివక్ష, వేధింపుల నిర్మూలనకు ఉద్దేశించిన చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఆత్మగౌరవాన్ని ఇచ్చేది భూమని, భూమిలేని ప్రతి ఎస్సీ, ఎస్టీ కుటుంబానికి ఐదెకరాల భూమిని పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. కుల నిర్మూలనా ప్రచారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక ప్రభుత్వాలు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. కులాంతర వివాహాలకు రూ.25 లక్షలు ప్రోత్సాహకం అందించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలపై అత్యాచారాలు జరిగే అవకాశం ఉన్న గ్రామాలను ముందే గుర్తించి, ముందుస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ తదితర కార్పొరేషన్లకు జనాభా దామాషా ప్రకారం వెంటనే నిధులు విడుదల చేయాలని పేర్కొన్నారు. బీసీలపై అత్యాచారాల నివారణకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో బాస్ కేంద్ర కమిటీ ప్రతినిధి దుర్గం సుబ్బారావు, నాయకులు ముత్యాల మోహన్, టిఎ.పీర్ బాషా, చాట్ల బయన్న, రవిశంకర్, రెడ్డిప్రసాద్, తలారి కృష్ణ, వై.గంగాధర్, వై.చిన్నా, డి.మోహన్, బైనేని సురేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బాస్ నేత శివప్రసాద్


పాఠశాలకు బీరువా, కుర్చీలను అందిస్తున్న పూర్వపు విద్యార్థులు

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థుల సహకారం


ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

పాఠశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు సహకారం అందించారు. 1996-97 సంవత్సరంలో వివేకానంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి అభ్యసించిన విద్యార్థులు సోమవారం పాఠశాలకు రూ.15 వేలు విలువచేసే బీరువా, కుర్చీలను అందజేశారు. ఈ పాఠశాలలో చదివి నేడు ఉద్యోగ, వ్యాపార రంగాలలో రాణిస్తూ పాఠశాలకు అవసరమైన సహకారంగా అందిస్తున్న పూర్వవిద్యార్థుల ఔదార్యాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురం వెంకటరమణ ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థి శ్రీనివాసులు నాయుడు మాట్లాడుతూ మా భవిష్యత్తుకు బాటలు వేసిన దేవాలయం వివేకానంద మున్సిపల్ పాఠశాలని, తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి పూర్వపు తన మిత్రుల సహకారంతో బీరువా, కుర్చీలను అందజేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హరిబాబు, ఆనంద, రమేష్, శ్రీనివాసులు నాయుడు, శ్రీదేవి, శ్రీలత, విశ్వనాథ్, సూరిబాబు, రాజశేఖర్, నాగేశ్వరి, రేవతి, హేమ, యశోద, కిరణ్మయి, ఈశ్వరి, మంగమ్మ, సరస్వతి పాల్గొన్నారు.

కుమ్మరపల్లె విఆర్ఎ మృతి

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని కుమ్మరపల్లె గ్రామ సేవకుడు భాస్కర్(50) అనారోగ్యంతో మృతి చెందారు. బంధువుల కథనం మేరకు.. భాస్కర్ కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం సంక్రాంతి భోగిపండుగ రోజున మృతి చెందారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ యజమాని మృతి చెందడంతో కుటుంబీకులు శోభసముద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాద ఛాయాలను అలుముకున్నాయి. భాస్కర్ కొద్ది కాలం మండల గ్రామ సేవకుల సంఘం అధ్యక్షునిగా కొనసాగారు.


భాస్కర్ (ఫైల్‌ఫోటో)

వైద్య కళాశాల ప్రయివేట్‌పరం కాకుండా కాపాడుకుందాం

- సిబ్బంది బదిలీలను రద్దు చేయాలి
- రాస్తారోకోలో సిపిఎం జిల్లా కన్వీనర్ శ్రీనివాసులు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె సర్వజన బోధనాసుపత్రిని ప్రయివేట్ పరం కాకుండా కాపాడుకోవడం ప్రజల బాధ్యతని సిపిఎం జిల్లా కన్వీనర్ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం మదనపల్లి సర్వజన బోధన ఆసుపత్రి ముందు సిపిఎం ఆధ్వర్యంలో 24 మంది స్టాఫ్ నర్సుల బదిలీలను నిరసిస్తూ రాస్తారోకో నిర్వహించారు. మదనపల్లి మెడికల్ కాలేజీని ప్రభుత్వమే నిర్వహించాలని, సిబ్బంది బదిలీలు రద్దు చేయాలని, ధర్మాసుపత్రిని కాపాడుకుందాం అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గంటకు పైగా రాస్తారోకో నిర్వహించడంతో చెన్నై-ముంబయి జాతీయ రహదారి, పటేల్ రోడ్డుపై వందల సంఖ్యలో వాహనాలు ఆగిపోవాడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రి గత వందేళ్లుగా ఎంతో మంది పేద రోగులకు వైద్య చికిత్సలు అందించి చరిత్రలో నిలిచిపోయిందన్నారు. పీలేరు, తంబళ్లపల్లి, పుంగనూరు నియోజకవర్గ ప్రజలతో పాటు కర్ణాటక ప్రాంత ప్రజలు కూడా ఇక్కడికే వచ్చి వైద్యం చేయించుకుంటారన్నారు. రోజుకు 1,200 నుంచి 1,500 మంది అవుట్ పేషెంట్లుగా వైద్య సేవలు పొందుతున్నారని, మదనపల్లి ధర్మాసుపత్రిగా పేరుగాంచిన ప్రభుత్వ ఆసుపత్రిని గత ప్రభుత్వం జిల్లా ఆసుపత్రిగా, తర్వాత రోజుల్లో సర్వజన బోధనాసుపత్రిగా అభివృద్ధి చేయడంతో ప్రజలందరూ హర్షించారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రభుత్వ వైద్యశాలకు గ్రహణం పట్టిందని, ఇక్కడున్న ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌ను ప్రయివేట్ పరం చేసేందుకు కూటమి ప్రభుత్వ పెద్దలు కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. 44 మంది వైద్యులను, మరో 24 మంది స్టాఫ్‌నర్స్‌లను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులివ్వడంలోని అంతర్యం ఏమిటని ప్రశ్నించారు. సర్వజన బోధనా ఆసుపత్రి వల్ల మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం వస్తుందని, దూర ప్రాంతాలకు వెళ్లడం, సకాలంలో వైద్యం అందక చనిపోవడం లాంటి బాధల నుండి విముక్తి ఉంటుందని భావించిన ప్రజలపై కూటమి ప్రభుత్వం పిడుగు వేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బోధనా ఆసుపత్రిని కాపాడుకోవడానికి ప్రజలు అందరూ ఐక్యంగా పోరాటం చెయ్యాలని సిపిఎం ప్రారంభం చేసిన ఉద్యమానికి మద్దతివ్వాలని కోరారు. ఐటియుసి నాయకులు కృష్ణమూర్తి, సిఐటియు నాయకులు ప్రభాకర్, ప్రముఖ న్యాయవాది సోమశేఖర్, ఆలం నాయకులు నూరుల్లా, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు నరసింహులు మాట్లాడుతూ ప్రయివేట్ ఆస్పత్రుల్లో పేదలను వివిధ రకాల పరీక్షల పేరిట దోచుకుంటున్నారన్నారని పేర్కొన్నారు. పేదలకు అండగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి కూడా పయివేటుపరమైతే ఇక సామాన్యుడు వైద్యం చేసుకునే పరిస్థితి ఉండదన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిని సర్వజన బోధన ఆసుపత్రి గానే ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రజల మద్దతు కూడగట్టి మదనపల్లె బంద్ కూడా పిలుపునిస్తామని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి నాయకులు, మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాష స్పందించి ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేయాలని సూచించారు. మదనపల్లె సర్బజన బోధనాస్పత్రిని ప్రయివేటు పరం కానివ్వమని, ప్రభుత్వమే నిర్వహిస్తుందని ప్రజలకు నమ్మకాన్ని కల్గిస్తూ ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. వ్యవస్థలను నిర్వీర్యం చేయకుండా కూటమి ప్రభుత్వం పటిష్టం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, రఘునాథ్, మునివెంకటప్ప, నారాయణ, పవన్, ఆటో యూనియన్ నాయకులు నావాజ్, రమణ, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు


మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైస్ చైర్మన్ దశరదరామిరెడ్డి

మున్సిపల్ కార్మికులకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ వైస్ చైర్మన్ పి.దశరద రామిరెడి, ఆయన సతీమణి వీరభద్ర స్వామి గుడి మాజీ చైర్మన్ పి.విజయమ్మ దంపతులు 200 మంది మున్సిపల్ కార్మికులకు చీరలు పంచలు సోమవారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఊరి మలినాలు శుభ్రపరుస్తూ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే మున్సిపల్ కార్మికులకు ఎంత చేసినా తక్కువేనని, ఉన్నంతలో పేదవారికి సాయం చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. భోగి పండగ సందర్భంగా తమ నివాసంలో ఎప్పటిలా చిన్న సాయంగా దుస్తులు తమ వంతు సాయంగా పంపిణీ చేశామన్నారు. ఊరి ప్రజల బాగోగులను చూస్తున్న కార్మికులకు అందరూ అన్ని రకాలుగా అండగా ఉండాన్నారు.

క్రీడలు మనిషిలో ఉత్తేజాన్ని నింపుతాయి

ప్రజాశక్తి-పీలేరు

క్రీడలు మనిషిలో ఉల్లాసాన్ని, ఉత్తేజాన్ని నింపుతాయని తెలుగుదేశం పార్టీ రాజంపేట పార్లమెంట్ నియోజకవర్గం నాయకులు కోటపల్లి బాబురెడ్డి తెలిపారు. సోమవారం పీలేరు మండలంలోని తలపులలో ఆయన క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. సంక్రాంతి పండుగను పురష్కరించుకుని మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్ను ప్రారంభించారు. ఈ సందరరేగా నాయకులు కోటపల్లె బాబురెడ్డి, స్పోర్ట్స్ మల్లి మాట్లాడుతూ క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదం చేస్తాయన్నారు. క్రీడాకారులు గెలుపోటములు సమానంగా స్వీకరించాలన్నారు. నిర్వాహకులు మురళీమోహన్ రెడ్డి, బాల మాట్లాడుతూ ఈ టోర్నమెంట్లో 14 టీములు పాల్గొంటున్నట్లు చెప్పారు. విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేల తోపాటు భోజన సదుపాయం ఏర్పాటు చేసినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో మస్తాన్, సందీప్ రెడ్డి, మదనమోహన్ నాయుడు, రామచంద్ర, నాగిరెడ్డి, క్రీడాకారులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఐద్వా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సంక్రాంతి పండుగ సందర్భంగా మదనపల్లె విజయనగర్ కాలనీలో ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం పట్టణ కమిటీ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించింది. విజయనగర్ కాలనీలోని వివిధ వీధుల్లోని మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆకర్షణీయమైన రంగురంగుల ముగ్గులతో అలరించారు. సంక్రాంతి పండుగ ప్రాశస్త్యాన్ని, సందేశాన్ని వివరిస్తూ అందరికీ శుభాకాంక్షలను తెలుపుతూ ముగ్గులను చిత్రీకరించారు. వివిధ ఆకారాల్లో రూపుదిద్దుకున్న ముగ్గులు న్యాయనిరే?తలను, చూపరులను ఎంతో ఆకర్షించాయి. ముగ్గుల పోటీదారులను రెండు గ్రూపులుగా విభజించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహూమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఐద్వా జిల్లా కన్వీనర్ భాగ్యమ్మ అధ్యక్షత వహించగా, ముఖ్య అథితులుగా స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రజియా, ఉపాధ్యాయని జ్యోతి, సిఐటీయు జిల్లా కోశాధికారి హరిశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న మహిళలను అభినందించారు. నేటి సమాజంలో జరుగుతున్న విషయాలను నిశితంగా గమనించాలని, మహిళలు చైతన్యంగా ఉండాలని తెలిపారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను దైర్యంగా ఎదిరించి వివక్షను ఖండించాలన్నారు. నిత్యావసరాల సరుకులపై పెరుగుతున్న అధిక ధరలు, అధిక పన్నులు, పెరుగుతున్న కరెంటు ఛార్జీలను నిరసించి, మొద్దు నిద్రలో ఉన్న ప్రభుత్వాన్ని మేల్కొలపాలని పిలుపునిచ్చారు. రాబోయే కాలంలో మహిళలను చైతన్యం చేసే దిశగా ఐద్వా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఐద్వా నాయకురాళ్ళు షహీనా, రెడ్డిప్రసన్న, కమలమ్మ, ఉషారాణి, జానకమ్మ పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-పుల్లంపేట

సంక్రాంతి పండుగ రోజులలో సంప్రదాయ క్రీడల పేరుతో అసాంఘిక కార్యకలాపాలు, కోడిపందేలు, పేకాట నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని పుల్లంపేట, ఓబులవారిపల్లి ఎస్ఐలు మోహన్ కుమార్‌గౌడ్, మహేష్ నాయుడు వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. జూద క్రీడలు కాకుండా సంప్రదాయ ఆటలు ఆడుకోవాలని సూచించారు. కోడి పందాలు, పేకాట, గుండాట, చెక్క బొమ్మ అలా ఏ జూద వ్యసనమైన ప్రజల జీవితాలను నాశనం చేస్తుందన్నారు. అసంఘూక కార్యకలాపాలలో పాల్గొనే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని కోడిపందాలు, జూదరులు కోడికత్తుల తయారీదారులు పేకాట శిబిరాల నిర్వహణపై ఇప్పటికే బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఎవరైనా మండల పరిధిలో కోడిపందాలు నిర్వహించిన పందాల నిర్వహణకు స్థలాలు భూములు ఇచ్చిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కొందరు యువకులు జూదాలకు బానిసై కేసుల్లో ఇరుక్కుపోయి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పేర్కొన్నారు. యువత ఇటువంటి కేసులలో ఉంటే వారి యొక్క భవిష్యత్తు అంధకారమవుతుందని తెలిపారు. ఇతర దేశాలలో ఉద్యోగాల కొరకు వెళ్లే వారికి ప్రభుత్వ ఉద్యోగాలు పొందే సమయంలో పాస్‌పోర్టు పొందే సమయంలో ఈ కేసులో అడ్డంకిగా మారి యువత యొక్క జీవితాలు అధోగతి పాలవుతాయని విషయాన్ని గుర్తించుకోవాలని తెలియజేశారు. ఎక్కడైనా కోడి పందాలు, జూదం ఆడిన ఇతర అసాంఘిక కార్యక్రమాలు నిర్వహించిన సంబంధిత పోలీస్ స్టేషన్ సమాచారం తెలియజేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. సమాచారం అందిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

గాలిపటాలు ఎగురవేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి

ప్రజాశక్తి - కడప

పిల్లలు గాలిపటాల ఎగురవేసే సమయంలో వారి వెంట పెద్దలు ఉండి విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు తగలకుండా దూరంగా ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్. రమణ సూచించారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిద్దెలపై నుంచి గాలి పటాలు ఎగు రవేసే క్రమంలో విద్యుత్ లైన్లకు దూరంగా ఎగురవేయాలని సూచించారు. ఒకవేళ విద్యుత్ లైనులకు కానీ, ట్రాన్స్‌ఫార్మర్లకు కానీ విద్యుత్ తీగలకు కానీ గాలిపటాలు చిక్కుకుంటే వాటిని వదిలి వేయాలన్నారు. వాటిని తీసుకునే క్రమంలో విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకుంటాయన్నారు. పెరుగుతున్న జనాభా దృష్ట్యా స్థల వ్యయం తదితర కారణాలవల్ల తాము ఎంత చెప్పినా ఇంటి నిర్మాణం లైన్లకు దగ్గర్లో చేపడు తున్నారు అన్నారు. కావున విద్యుత్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జాగ్రత్తలు వహించాలని సూచించారు. పిల్లలు లైన్ల లోని విద్యుత్‌ను, వాటి వల కలిగే ప్రమా దాలను గుర్తించలేరని, పెద్దలు తగు జాగ్రత్తలు తీసుకొని మైదానాలలో గాలిపటాలు ఎగర వేసుకునేలా విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న అగస్టీన్‌రాజు అభిమానులు

పేదల పక్షపాతి డాక్టర్ గేయానంద్

- క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ రాజు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

నాస్తికుడు, పేదల పక్షపాతి మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ తనకు స్పూర్తిదాత, మెంటర్ అని క్యాంబెల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అగస్టీన్ రాజు పేర్కొన్నారు. స్థానిక క్యాంబెల్ ఆసుపత్రిలో సోమవారం అగస్టీన్ రాజు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పాస్టర్స్ శుభాకాంక్షలు తెలుపుతూ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం అగస్టీన్ రాజు మాట్లాడుతూ తల్లిదండ్రులు నేర్పిన సంస్కారం తనను ఇలా మీ అందరి ముందు నిలబెట్టిందన్నారు. అనంతపురంలో రూ.5లకే వైద్యం అందిస్తూ ఎంతోమందికి గేయానంద్ స్ఫూర్తిగా నిలిచారన్నారు. ఆయన నిరాడంబరత, నిబద్ధత పలువురికి ఆదర్శమన్నారు. క్యాంబెల్ ఆసుపత్రి జిల్లాలోనే ఉన్నతమైన వైద్యం అందిస్తున్న వైద్యశాల అని కొనియాడారు. అగస్టీన్ రాజు సతీమణి మాట్లాడారు. పురప్రజలు, అభిమానులు, ఆసుపత్రి సిబ్బంది, నర్సింగ్ విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వాడవాడలా సంక్రాంతి సంబరాలు



రైల్వేకోడూరు: భోగి మంటలు వేస్తున్న కాలనీ వాసులు



పీలేరు : భోగి మంటల వద్ద ఉపాధ్యాయులు, మానవత సంస్థ సభ్యులు

ప్రజాశక్తి-రైల్వేకోడూరు

భోగి మంటలతో సోమవారం సంక్రాతి సంబరాలు ప్రారంభమయ్యాయి. మకర సంక్రాంతికి ముందు రోజున భోగి పండుగను జరుపుకుంటారు. మకర సంక్రాంతి మరునాడు కనుమ పండుగ జరుపుకుంటారు. వ్యవసాయదారునికి పశువులే సంపద,పంటలు వాటి శ్రమ ఫలితంగా వచ్చినవి కాబట్టి, ఆ రోజు పశువులను పూజించి వాటికి పొంగలి వండి పెడతారు.భోగి మంటలు అనంతరం ప్రతి ఒక్కరూ తలకు నూనె అంటుకుని తలంటి స్నానం చేసి పూజలు నిర్వహిస్తారు. **కలకడ:** భోగిమంటలను వాడవాడలా వేసి గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సంబరాలను అంబరాన్ని అంటే ఎలా నిర్వహించుకున్నారు. మండలంలోని పలు గ్రామాలలో వేకువ జామున నిద్ర లేచి ఇండ్లలోని పాత వస్తువులతో భోగి మంటలు ఏర్పాటు చేసుకుని మంటల మధ్య సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ మంటలలో గత ఏడాది నుంచి ఉన్న పాత వస్తువులు అన్నింటిని మంటలు వేసి కొత్త సంవత్సరానికి నాంది వెలుగుతో సంబరాలు నిర్వహించుకోవడం ఆనవాయితుగా వస్తున్న ఆచారం. ఈ క్రమంలోనే ఇండ్లలోని ప్రతిపాద వస్తువును మంటలలో వేసి దహనం చేశారు.అనంతరం భోగిమంటల్లో వేడినీళ్లు ఏర్పాటు చేసుకుని ఇంటిళ్లపాది తలంటు స్థానాలు చేసుకొని పూజలు నిర్వహించుకున్నారు. **పీలేరు:** సంక్రాంతి పండుగ పర్వదినాల సందర్భంగా మొదటి రోజు భోగి పండుగను ప్రజలు ఆనందోత్సాహల మధ్య వైభవంగా జరుపుకున్నారు. ప్రజలు భోగభాగ్యాలకు ప్రతీకగా చెప్పుకునే భోగి పండుగన పురస్కరించుకొని సోమవారం ప్రజలు తమ ఇళ్ళ ముందు భోగి మంటలు వేసుకుని సంక్రాంతి వేడుకలకు శ్రీకారం చుట్టారు. అదేవిధంగా పీలేరు పట్టణానికి చెందిన మానవత స్వఛ్ఛంద సంస్థ సభ్యులు, ఉపాధ్యాయ బృందం స్థానిక ఎస్వి డీలక్స్ రోడ్ లో భోగి మంటలు వేసి ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో వంగిమళ్ళ రామచంద్ర, శెట్టి సుబ్రమణ్యం, పోతం శెట్టి రమేష్, కృష్ణమూర్తి, రహత్ బాష, సుధాకర్ బాబు, అక్రం బాష, రాజేంద్ర, చంద్రమౌళి, గఫార్ సాహెబ్, కరేముల్లా పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :** మండల పరిధిలోని ఆకేపాడులో సంక్రాంతి సంబరాలు అబరాన్ని అంటేలా సాగాయి. సంక్రాంతి సందర్భంగా ఆకేపాడు మహాలక్ష్మి దేవి ఆలయంలో ఆకేపాటి మురళీరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన స్వగ్రామమైన ఆకేపాడులో గ్రామ ప్రజలకు ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో 2 వేల మంది పురుషులకు, 3 వేల మంది మహిళలకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రీజెన్సీ విద్యా సంస్థల అధినేత జి.ఎన్.నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురళీరెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం పండుగల సమయంలో బట్టలు పంపిణీ కార్యక్రమం, పేదలకు అన్నదానం చేయడం అనేది సంప్రదాయంగా వస్తుందని ఇటువంటి కార్యక్రమాలు భవిష్యత్తులో మరిన్ని చేయాలని ఆకాక్షించారు. చుట్టపక్కల పల్లెల్లో భారీ సంఖ్యలో పేద ప్రజలు దుస్తులు పంపిణీ కార్యక్రమానికి వచ్చారు. ఈ సందర్భంగా మురళీరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ ప్రతి కుటుంబంలో సంతోషం చిగురించాలనే సంకల్పంతో తన తండ్రి ఆకేపాటి వేణుగోపాల్ రెడ్డి జ్ఞాపకార్థం ఆకేపాడు చుట్టు పక్కల గ్రామాల పేద ప్రజలకు గత నలభై సంవత్సరాలుగా ప్రతి ఏటా సంక్రాంతి పండుగకు బట్టలు పంపిణీ, అన్నదాన కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. ప్రతి ఇంటా సంక్రాంతి శోభ వెల్లివిరియాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. **నందలూరు :** మండలంలోని ప్రజలు తెల్లవారుజామున భోగి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ళ ముందర పెద్దగా భోగి మంటలు వేశారు. పలువురు అదే మంటలలో నీటిని కాచుకొని స్నానాలు ఆచరించారు. మహిళలు ఇళ్ళ ముందర రంగవల్లులతో అలంకరించారు. చేసిన పిండి వంటలను దేవుని గదిలో ఉంచి ఇళ్లలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. యువత ఉత్సాహంగా పోటీలు పడి భోగి మంటలు వేశారు. ఇంటిలోని పాత వస్తువులు, ఇతరత్రా పనికిరాని సామాగ్రినంత మంటల్లో వేసి ఆనందపడ్డారు. హైదరాబాదు, బెంగుళూరు, చెన్నై లతోపాటు ఇతర దేశాలలో ఉన్నవారు సైతం సంక్రాంతి పండుగకు వారి గ్రామాలకు చేరుకొని ఉత్సాహంగా పండుగలో పాల్గొంటున్నారు. **కలికిరి:** ప్రతి సంవత్సరం మండలం కొట్టాలలో నిర్వహించబోవు మూడు రోజులు సంక్రాంతి సంబ రాలు భోగి పండుగ సందర్భంగా అత్యంత వైభవంగా పరిమళ పత్రిజీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ప్రాతఃకాల ధ్యానంతో ప్రారంభమయ్యాయి మొదటి రోజు కార్యక్రమం వివిధ ప్రాంతాల నుంచి వచ్చినటువంటి ధ్యానులు ధ్యానాభిమానులు కొన్నివేల మంది పాల్గొని ర్యాలీలు, చెక్కభజనతో సాం స్కృతిక కార్యక్రమాలతో అందరినీ ఆలరింపజేశారు. కర్ణాటక నుంచి వచ్చిన చిన్నారుల క్లాసికల్ డాన్స్, భరతనాట్యం కార్యక్ర మాలతో సంబరాలు మిన్నంటాయి. ఈ కార్యక్రమాలు మంగళవారం, బుధవారం అనేక ధ్యాన కార్యక్రమాలు, సత్సంగాలు జ్ఞానుల ప్రబోధనలతో సాంస్కృతిక కార్యక్రమాలతో సందర్శకులను రంజంపజే యను న్నాయి. కార్యక్రమంలో కొట్టాల జాతవనం నిర్వాహకులు ప్రభాకర్ వివిధ ప్రాంతాల నుంచి వచ్చినటువంటి మాస్టర్స్‌తో ఘనంగా నిర్వించబడ్డాయి.



పేదలకు అన్నదానం చేస్తున్న జి.ఎన్.నాయుడు, ఆకేపాటి మురళీరెడ్డి



కలికిరి : సంక్రాంతి సంబరాల్లో నృత్యం చేస్తున్న కడప ముద్ర డాన్స్ అకాడమీ చిన్నారులు

భూములు కాపాడడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి - బి.కొత్తకోట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా కూడా ఇంతవరకు భూకబ్జాలకు పాల్పడిన భూ భకాసురులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడాన్ని నిరసిస్తూ భోగి పండుగ సందర్భంగా సోమవారం ఉదయం ఐదు గంటలకు స్థానిక పిటిఎం రోడ్డులో సిపిఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భోగి మంటలు వేసి భూ భకాసురుల చిత్రపటాలను దహనం చేశారు. కబ్జాల నుంచి ప్రభుత్వ, బలహీన వర్గాల భూములను కాపాడాలని, వంక, వాగు, రాస్తా, కుంట, మఠం, సోత్రియం, చెరువు, పోరంబోకు తదితర భూములను కబ్జాల చెర నుంచి విడిపించి ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరారు. కబ్జాలకు గురైన బి.కొత్తకోట నగర పంచాయతీ ఆస్తులను కాపాడాలని, రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలపై రైతులు ఇచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని, భూకబ్జాలు నశించాలని,భూ భకాసురులు నశించాలని నినాదాలు చేశారు. అనంతరం భూ భకాసురుల చిత్రపటాలను భోగిమంటల్లో వేసి దహనం చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ తంబళ్లపల్లె నియోజకవర్గపు కార్యదర్శి ఎస్.మనోహర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎస్.బషీర్‌ఖాన్ మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలో భూ కబ్జాలు పెద్దఎత్తున జరిగాయని, మొలకలచెరువు మండలం గూడుపల్లి గ్రామంలోని చెన్నప్పగారి పల్లిగడ్డలో సుమారు 200 ఎకరాలు సోత్రియం భూములు ఉంటే అందులో సగానికి పైగా బడా భూస్వాములు రెవెన్యూ అధికారుల అండదండలతో కబ్జాలు చేశారని విమర్శించారు. పిటిఎం మండలం పట్టెంవాండ్లపల్లి గ్రామంలోని వ్యాసరాయ మఠంకు చెందిన భూములను సగానికి పైగా కబ్జాలకు గురయ్యాయన్నారు. బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామంలోని 58 సర్వే నెంబరులో ప్రభుత్వ భూమి కబ్జా అయిందని, నగర పంచాయతీ పరిధిలోని సర్వే నెంబర్ 8లో 14 ఎకరాల వాగు పోరంబోకు భూమి కబ్జాలకు గురైందని ఇలా చెప్పుకుంటూ పోతే వందలాది ఎకరాల భూములు కబ్జాలకు గురయ్యాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో వేలాది అర్జీలు భూ సమస్యల మీదనే వచ్చాయని, దీనిబట్టి చూస్తే భూ సమస్యలు ఎంత పెద్ద స్థాయిలో ఉన్నవో అర్థమవుతుందని వెంటనే సదరు అర్జీలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయంలో భూ రికార్డులు దగ్ధం సంఘటన జరిగినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం అంతా హుటాహుటిన మదనపల్లికి వచ్చి కబ్జాల పరంపరలో భూములు కోల్పోయిన బాధితుల వద్ద నుండి వేలాది అర్జీలు తీసుకుని అందరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని, ఇంతవరకూ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు జి.రఘునాథ్, ఎం.అష్రఫ్‌అల్లి, ఎస్.తంబయ్యశెట్టి, రామచంద్ర, సోమశేఖర్, హబీబ్, గంగులప్ప, షఫీ, రియాజ్, శంకర, చాంద్‌బాషా, గణేష్, సోమశేఖర్, బావాజాన్, మస్తాన్, సోము పాల్గొన్నారు.



భూ బకాసురుల చిత్రపటాలను దహనం చేస్తున్న నాయకులు

ఎన్‌టిఆర్ శుద్ధి నీటి పేరుతో దందా

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె గ్రామంలో పేద ప్రజలందరికి మినరల్ వాటర్ ఇవ్వాలనే ఉద్దేశంతో గతంలో చంద్రబాబు పాలనలో వేంపల్లెలోని తిరుమల థియేటర్ సమీపంలో ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పేరుతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. అప్పటి నుంచి వైసిపి పాలన కూడా వేంపల్లె ప్రజలకు సరసమైన ధరకే శుద్ధి జల నీరు లభించేది. ఇటీవల కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తిరుమల థియేటర్ సమీపంలో ఉన్న ఎన్‌టిఆర్ సుజల స్రవంతి నీటి శుద్ధి మినరల్ వాటర్ ప్లాంట్‌ను వైసిపి నేతల నుంచి టిడిపి నేతలు హస్తగతం చేసుకున్నారు. టిడిపి అధినేతలు పార్టీ కోసం పని చేసిన వ్యక్తులకు ఇవ్వాలనే ఉద్దేశంతో ఉండగా.. స్థానిక టిడిపి నేతల ఆదేశాల మేరకు పార్టీ కోసం సోషియల్ మీడియాలో చురుకుగా పని చేసిన వ్యక్తికి ఎన్‌టిఆర్ మినరల్ వాటర్ ప్లాంట్‌ను అప్పగించారు. సదరు వ్యక్తి మరో వ్యక్తికి ధారాదత్తం చేశారు. ఆ వ్యక్తి శుద్ధి నీటి పేరుతో ధరను పెంచి నీటి దందా మొదలెట్టారు. వేంపల్లె గ్రామంలో ప్రయివేటు వ్యక్తులు కూడా మంచి నీటి మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు. అయితే ప్రయివేటు నీటి శుద్ధి వ్యాపారులు ధరను పెంచి నీటిని విక్రయాలు చేస్తున్నారు. గతంలో రూ.10కే కూల్ వాటర్ ఎన్‌టిఆర్ మినరల్ వాటర్ ప్లాంట్‌లో ప్రజలకు అందేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ అధీనంలో పని చేస్తున్న ఎన్‌టిఆర్ సుజల స్రవంతి మినరల్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు కూడా ప్రయివేటు వ్యక్తుల్లాగా కూల్ వాటర్‌ను రూ.15కు పెంచి విక్రయాలు సాగిస్తున్నాడు. ప్రజలకు శుద్ధి నీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన దీన్ని ప్రస్తుతం ఉన్న నిర్వాహకుడు నీటి దందాకు తెరలేపడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్లాంట్‌ను వ్యాపార కేంద్రంగా మలుచుకున్నారనే ఆరోపణలున్నాయి. గతంలో ప్లాంట్ సమీపంలోనే గ్రామ పంచాయతీ తరుపున ప్రజలకు నీటిని అందివ్వాలని బోరు వేశారు. ఇక్కడ ఎన్‌టిఆర్ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయడంతో ఆ బోరు నీటిని మినరల్ వాటర్ ప్లాంట్‌కు అనుసంధానం చేశారు. ప్రస్తుతం బోరుకు వస్తున్న కరెంటు బిల్లును కూడా పంచాయతీ అధికారులు చెల్లిస్తున్నట్లు తెలిసింది. ప్రజలకు తక్కువ ధరకు శుద్ధి నీటిని అందించాల్సిదిపోయి అధిక ధరకు విక్రయిస్తూ తమ జేబులు నింపుకొంటున్నారు. ఎన్‌టిఆర్ వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు ఇష్టం వచ్చినట్లు బోర్డులు పెట్టి అధిక ధరలకు శుద్ధి నీటిని విక్రయాలు చేస్తున్నాడు. నామ మాత్రపు ధరను పెట్టి ప్రజలకు శుద్ధి నీటిని అందించాలన్న లక్ష్యంతో తెలుగు దేశం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌టిఆర్ సుజల స్రవంతి పేరుతో ఉచిత వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేసింది. వేంపల్లెలో మాత్రం టిడిపి పార్టీ ఆ లక్ష్యాన్ని నీరు గార్చుతోంది. అటువైపు వెళుతున్న ప్రజలు, ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులు వాటర్ బాటిళ్లతో నీరు తాగేందుకు వస్తే నిర్వాహకుడు పిల్లలు అని కూడా చూడకుండా వాటర్ బాటిళ్లకు డబ్బు వసూలు చేస్తున్నాడనే ఆరోపణలున్నాయి. గ్లాస్ నీటిని కూడా అమ్ముకుంటున్నారు. నీటి వ్యాపారం చేసే ప్రయివేటు వ్యక్తులే పాదచారులు దాహం తీర్చు కునేందుకు ప్లాంట్ వద్దకు వెళ్లితే నీటి దప్పిక తీర్చుతున్నారు. ఉచితంగా నీళ్లు తాగడానికి ఇదేమైనా మీ సొమ్మునా, కరెంటు బిల్లు మీరు కడుతున్నారా అంటూ నిర్వాహకుడు కసురు కుంటున్నాడని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ఎమైనా చెబితే ఈ ప్లాంట్‌ను తాను డబ్బులు పెట్టి బిగించుకున్నాను అని గదమాయిస్తున్నట్లు ప్రజలు అంటున్నారు. ఈ వాటర్ ప్లాంట్ వద్ద గతంలో ఎంతో మంది పిల్లలు, పెద్దలు బాటిళ్లతో నీటిని పట్టుకొంటున్నా ఎవరూ అడ్డు చెప్పేవారు కాదు. ప్రస్తుత వాటర్ ప్లాంట్ నిర్వాహకుడు టిడిపి ప్రభుత్వానికి చెడ్డ పేరు తెస్తున్నట్లు పలువురు టిడిపి నేతలు వాపోతున్నారు. సాకులు చెప్పి నీటిని అధిక ధరలకు పెంచారని పేర్కొంటున్నారు. ధర పెంచడంపై అధికారులు మౌనం వహిస్తుండడంతో నీటి వ్యాపారం జోరుగా సాగుతోంది. ఇప్పటికైనా ఎన్‌టిఆర్ సుజల స్రవంతి ప్లాంట్‌పై టిడిపి నేతలు ప్రత్యేకదృష్టి పెట్టి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



గోల్డ్ విన్నర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జంప్ రోప్ గోల్డ్ విన్నర్‌కు సన్మానం

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థి తప్పెట్ల వీర హరీష్ ఇండో-నేపాల్ జంప్ రోప్ ఛాంపియన్ షిప్-2025(సౌత్ ఏషియా)లో గోల్డ్ మెడల్ విన్నర్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు గోశెట్టి రామ్మోహన్ ఆధ్వర్యంలో సోమవారం బ్యాండ్ మేళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శాలువా, పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా రామ్మోహన్ మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి జాతీయస్థాయిలో రాణించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని క్రీడా పోటీల్లో తమ విద్యార్థి రాణించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. మిగిలిన విద్యార్థులు హరీష్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు. కార్యక్రమంలో పీడీ వినోనియా రాణి, నాయకులు వై.వెంకటసుబ్బయ్య, బికె సురేష్, రవి ప్రకాష్, రవీంద్రారెడ్డి, ఆనంద రావు, ఉపాధ్యాయులు మునెయ్య, శ్రీనివాసులు, స్వర్ణలత, విద్యార్థులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దరఖాస్తుకు గడువు పెంచాలి

ప్రజాశక్తి - వేంపల్లె

కడప జిల్లాలో వివిధ కార్పొరేషన్ల కింద లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేయడానికి ఈనెల 8న బిసి సేవా సహకార సంస్థ విడుదల చేసిన ప్రకటనలకు సంబంధించి దరఖాస్తు గడువును పొడిగించాలని జిల్లా బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ప్రసాద్‌రావు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వివిధ కార్పొరేషన్లకు చెందిన లబ్ధిదారుల ఎంపికకు ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోమని అధికారులు నోటిఫికేషన్ ఇచ్చారని, అయితే ఈనెల 12వ తేదీ వరకు కూడా సంబంధిత వెబ్‌సైట్ అందుబాటులో లేదని తెలిపారు. ఈనేపథ్యంలో జిల్లాలో ఇప్పటివరకు ఎవరు దరఖాస్తు చేసుకోలేదన్నారు. అంతేకాక వివిధ కులాలకు చెందిన అభ్యర్థులకు వారి కుల సర్టిఫికెట్‌ను పొందుటకు 5 రోజులపాటు సెలవులు వచ్చాయన్నారు. వీటన్నింటిని ప్రభుత్వం దృష్టిలో పెట్టుకొని దరఖాస్తు గడువును ఈ నెల 30 వరకు పెంచాలని ఆయన కోరారు. జిల్లాలో బ్రాహ్మణ కార్పొరేషన్ కింద కేవలం 9 యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలని నోటిఫికేషన్‌లో ఇచ్చారని, జిల్లాలో బ్రాహ్మణ అభ్యర్థుల పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఆ సంఖ్యను కూడా పెంచాలని ప్రసాదరావు కోరారు.

క్రైం కార్నర్



ఎర్రచందనం దుంగలతో డిఎస్‌పి సుధాకర్

28 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని అనంతసముద్రం కందిరీగల గుట్ట వద్ద అక్రమంగా తరలిస్తున్న రూ.ఎనిమిది లక్షలు విలువైన 28 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని 12 మందిని అరెస్టు చేసినట్లు రాజంపేట డిఎస్‌పి సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్ తన సిబ్బందితో అనంతసముద్రంలో ముందస్తు సమాచారం మేరకు కూంబింగ్ నిర్వహిస్తున్న సమయంలో పట్టుబడ్డ 12 మందిని అరెస్టు చేశారన్నారు. వారి వద్ద ఉన్న దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ సిఐ బివి రమణ, నందలూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్ గౌడ్, సిబ్బంది నరసింహులు, మనోజ్, శ్రీను, శ్రీహరి, రామకృష్ణారెడ్డి, నాగేశ్వరరావు, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బస్సు ఢీకొని దంపతులు గాయపడిన సంఘటన సోమవారం మదనపల్లె రూరల్ మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. పట్టణంలోని చీకలిగుట్టకు చెందిన రమణ, అంజమ్మ దంపతులు సొంత పనిమీద ద్విచక్ర వాహనంలో బెంగళూరు రోడ్డులోని తిప్పారెడ్డిగారిపల్లెకు బయలుదేరారు. మార్గమధ్యంలోని చిప్పిలి వద్ద వెనకనుంచి వస్తున్న క్లీన్ ఫుడ్స్ ఫ్యాక్టరీకి చెందిన ప్రైవేట్ బస్సు వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో దంపతులు ఇద్దరు కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఆ వెంటనే స్థానికులు బాధితులను ఆటోలో స్థానిక జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆంజమ్మ తలకు బలమైన గాయమైందని రెండు రోజులు ఐసియులో చికిత్స అందించాలని సూచించి ఆస్పత్రిలో చేర్చారు. ఈ మేరకు తాలూకా పోలీసులు విచారణ చేపట్టారు.

ఐదుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి - బి.కొత్తకోట

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని రహస్యంగా జూదమాడుతున్న వ్యక్తులను సోమవారం అరెస్ట్ చేసినట్లు పిటిఎం ఎస్ఐ రవికుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని చెట్లపల్లి పడమర వైపు నీలగిరి చెట్ల వద్ద ఐదుగురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.10,710 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

ప్రజాశక్తి - బి.కొత్తకోట

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి చెందిన సంఘటన బి.కొత్తకోట మండలంలో జరిగింది. సిఐ జీవన్ గంగానాథ్ బాబు కథనం మేరకు వివరాలు. పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ పడమర వైపు గల బీడు భూమిలో దిల్షాద్ (56) అనే మహిళ అపార్మకస్థితిలో చనిపోయినట్లు ఆమె కుమార్తె బాబుఖాన్ భార్య ఎం.హసీనా ఫిర్యాదు చేసిందన్నారు. తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించామన్నారు. ఎవరైనా సదర మహిళను హత్య చేశారా లేదా ఆత్మహత్యకు పాల్పడిందా తదితర వివరాలు విచారణలో తెలియాల్సి ఉంది.మ ృతురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు.

వృద్ధుడి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - రామసముద్రం

ఆటోలో వెళ్లిన వృద్ధుడు వారం రోజులైనా ఇంటికి తిరిగిరాని సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రామసముద్రం ఎస్ఐ వెంకటసుబ్బయ్య తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని మాలేనత్తం పంచాయతీ ఉప్పినల్లి గ్రామానికి చెందిన సుబ్బన్న కుమారుడు వెంకటరమణ 80 సం, ఈ నెల 6వ తేదీన పెన్షన్ తీసుకున్నాడు. అనంతరం రామసముద్రం వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి ప్యాసింజర్ ఆటోలో బయలుదేరి వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. సాయంత్రం వరకు వృద్ధుని రాకకోసం ఎదురు చూసిన కుటుంబ సభ్యులు వారి బంధువులు వద్దకు ఎక్కడికైనా వెళ్లి ఉంటాడని వెతికారు. వృద్ధుడి ఆచూకీ ఎంతకీ ఎభ్యం కాకపోవడంతో సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో వృద్ధుడి కుమారుడు ఆంజప్ప ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.